219 నంబర్ బస్సు వేళలు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో పటాన్‌చెరు నుంచి సికింద్రాబాద్ వరకు 219 నెంబర్‌తో సిటీ ఆర్డినరీ బస్సు నడుస్తోంది. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 5 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు చివరి బస్సు నడుపుతారు. ప్రతి 10 నిమిషాలకో బస్సు అందుబాటులో ఉంటుంది. ఏవైనా ట్రాఫిక్ సమస్యలు వస్తేనే కొంత ఆలస్యం అవుతుంది. ఈ బస్సు పటాన్‌చెరు బస్టాండ్‌లో బయలుదేరి ఇక్రిశాట్, ఆర్సీపురం, బీరంగూడ, అశోక్‌నగర్, లింగంపల్లి, చందానగర్, మదీనాగూడ, ఆల్విన ఎక్స్‌రోడ్, మియాపూర్, నిజాంపేట్, జేఎన్‌టీయూ-హెచ్, కేపీహెచ్‌బీ మెయిన్ రోడ్డు, కూకట్‌పల్లి, ప్రశాంత్ నగర్, బాలానగర్, శోభనా థియేటర్, బోయిన్‌పల్లి, తాడ్‌బండ్, ప్యాట్నీ సెంటర్ మీదుగా సికింద్రాబాద్ వరకు నడుస్తుంది.

శిల్పారామంలో ముగిసిన 'ఎస్పిర్మిటీ-4'



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఎస్పిర్మిటీ-4 కార్యక్రమం ఆదివారం ముగిసింది. రెండు రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, చేనేత హస్తకళలు, బెంగాలీ భోజన స్టాల్స్ ఆకర్షణగా నిలిచాయి. పెయింటింగ్ ప్రదర్శన, బెంగాలీకి చెందిన డిజైన్స్‌తో కుర్తా, పైజామా, చేనేత చీరలు, డ్రెస్సులు, నగలు, వివిధ రకాల బెంగాలీ వంటకాలతో నగరవాసులను అలరించారు. కార్యక్రమంలో దాదాపు 300 మంది కళాకారులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో దీప్‌మేళా ఎగ్జిబిషన్..

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో కొనసాగిన దీప్‌మేళా ఎగ్జిబిషన్ ఆదివారం ముగిసింది. ఆదివారం సెలవురోజు కావడంతో సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు, గృహోపకరణాలు, రాగి ఉత్పత్తులను కొనుగోలు చేశారు.

బీజేపీలో పలువురి చేరిక



చేరినవారితో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కార్యాలయంలో గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి, గోపన్‌పల్లితండాకు చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. వారికి గంగాధర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. పాత, కొత్త కలయికతో అందరూ సమష్టిగా పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కష్టపడ్డ వారికి పార్టీలో సముచిత స్థానం తప్పకుండా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హన్మంతునాయక్, శ్రీనివాస్, శేఖర్, రంగస్వామి, జనార్దన్, ఆనంద్, చంద్రమౌళి, రామకృష్ణ, శ్రీనివాస్, నరేశ్, రాజేశ్, రామకృష్ణ, ప్రభు పాల్గొన్నారు.

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా శివాలయాలలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలోని శ్రీరామలింగేశ్వర ఆలయం, జేపీ కాలనీలోని ఉమామహేశ్వర ఆలయం, చైతన్య నగర్ కాలనీలో మహాదేవుడి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం నలుగురికి రూ.1.25 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్, కాశీనాథ్ యాదవ్, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, మంజుల, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి ఆపన్న హస్తంగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో 179మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.63.28లక్షల విలువైన చెక్కులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడా ప్రారంభం కానుందని తెలిపారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రమోద్ గౌడ్ పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్

ఆల్విన్‌కాలనీ: ప్రత్యూష ఇంటర్నేషనల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హెచ్ఎంటీ హిల్స్ కమిటీ హాల్‌లో చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. 7 సంవత్సరాల నుంచి 9, 11 సంవత్సరాలు, ఉత్తమ మహిళా కేటగిరిల్లో పోటీలు జరిగాయి. మొత్తం 80 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రతి విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు, ట్రోఫీ, మెడల్‌ను నిర్వాహకులు అందజేశారు. బహుమతులను ఉమెన్ గ్రాండ్ మాస్టర్ ప్రత్యూష బొడ్డ చేతుల మీదుగా అందజేశారు.

నిరంతర విద్యుత్ కోసం చర్యలు

పటాన్‌చెరు టౌన్: గుమ్మడిదల మండల పరిధిలో దోమడుగు, బొంతపల్లి వివిధ గ్రామాల్లో బొంతపల్లి విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ ఆదివారం పర్యటించారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వినియోగదారుల దగ్గరికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



హెచ్‌సీయూలో మొక్కలు నాటేందుకు సిద్ధమైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



హెచ్‌సీయూలో మొక్కలు నాటుతున్న వలంటీర్లు



క్లీన్ డ్రైవ్‌లో పాల్గొన్న వలంటీర్లు

అమ్మ పేరిట ఓ మొక్క..

ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు కార్యక్రమం షురూ

- హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ
- మొక్కలు నాటిన అధికారులు, సిబ్బంది, వలంటీర్లు
- ఏడాది పొడవునా ప్రతి శనివారం, ముఖ్య రోజుల్లో చేపట్టాలని నిర్ణయం

రాయదుర్గం: ఇటీవల దేశ ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిఒక్కరూ తమ 'అమ్మ' పేరిట మొక్కను నాటాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని 'నేషనల్ సర్వీస్ స్కీమ్' (ఎన్ఎస్ఎస్) సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లో 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఎన్ఎస్ఎస్ సెల్, హార్టికల్చర్, శానిటేషన్ విభాగాల సహకారంతో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య పర్యవేక్షణలో క్యాంపస్‌లో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు.



ఏడాది పొడవునా 'ఏక్ పేడ్ మా కే నామ్'

- హెచ్‌సీయూ క్యాంపస్‌లో యేటా పర్యావరణ దినోత్సవం రోజుతో పాటు వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.
- ఇప్పటినుంచి ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో ఏడాది పొడవునా 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు.
- ఇందులో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, హార్టికల్చర్, శానిటేషన్ విభాగాలే కాకుండా హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్, వైస్‌చాన్స్‌లర్లు, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది అందరినీ భాగస్వాములు చేయనున్నారు.
- ఏడాది పొడవునా ప్రతి శనివారం, ఇతర ముఖ్యమైన రోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.
- ముఖ్యంగా క్యాంపస్‌లో పండ్లు, పూల మొక్కలే ఎక్కువగా నాటాలే ఏర్పాట్లు చేస్తున్నారు.
- మొదటిసారిగా శనివారం 450 మొక్కలు నాటారు. ఇందులో మామిడి, దానిమ్మ, మందార, క్లోరోఫైటం, తాటి, గుడిచెట్టు వంటివి అధికంగా ఉన్నాయి. భవిష్యత్‌లో అన్ని పూలు, పండ్ల మొక్కలే నాటాలని నిర్ణయించారు.



మొక్కలు తల్లితో సమానం..



మొక్కలను తల్లితో సమానంగా భావించాలనే ఆలోచన, ప్రధాని సూచనపై 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే స్లోగన్‌తో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇందులో వైస్‌చాన్స్‌లర్ మొదలు కొని అన్ని స్థాయిల ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బందిని భాగస్వాములను చేసి వారి తల్లిపేరుతో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఏడాది పొడవునా ప్రతి శనివారం, ఇతర ముఖ్య రోజుల్లో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం చేపడుతున్నాం.

– డాక్టర్ కృష్ణయ్య, కోఆర్డినేటర్ హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ సెల్

మాటల్లో చెప్పలేని అనుభూతి..



హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట చేపట్టిన కార్యక్రమంలో అమ్మ పేరిట మొక్కను నాటిన అనుభూతి మాటల్లో చెప్పలేనిది. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది.

– కుసుమ, ఎంపీహెచ్ విద్యార్థి, వలంటీర్

మొక్కలు నాటడం ఆనందంగా ఉంది..



'ఏక్ పేడ్ మా కే నామ్ పేరిట' మా అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉంది. నేను చదివే భవనం పరిసరాల్లో మొక్కను నాటాను. అంతేగాకుండా మొక్క సంరక్షణకు రోజు నీళ్లు పడుతూ ఉంటాను. కొత్తగా థీమ్‌తో చేపట్టే కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటాను.

–శ్రావణి ఎంపీహెచ్ విద్యార్థి, వలంటీర్

నాటిన మొక్కలను సంరక్షించాలి..



చెట్లు అమ్మలాంటివే. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. క్యాంపస్‌లో అమ్మపేరిట మొక్కను నాటడం ఆనందంగా ఉంది. ఇంటర్ స్థాయి నుంచే ఎన్ఎస్ఎస్ విభాగాల్లో పనిచేస్తూ వస్తున్న హెచ్‌సీయూ క్యాంపస్‌లో కూడా కొనసాగుతున్నాను. ఒక్క చెట్టు నరికితే పది మొక్కలు నాటేలా నిబంధనలు పెట్టాలి.

– వెంకట్‌దాస్, పరిశోధక విద్యార్థి, వలంటీర్

వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి



కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌తో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పిలుపునిచ్చారు. చందానగర్ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్ కాలనీలో ఫ్రెండ్స్ షిప్ డే సందర్భంగా ఆ కాలనీ అధ్యక్షుడు దుప్పెల్లి వెంకటేశం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆదివారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్స్ షిప్ డే గుర్తుగా మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఖాళీ స్థలాలు, రోడ్లకిరువైపులా, అన్ని రకాల అనువైన ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రసాద్, వెంకటేశ్, అక్బర్ ఖాన్, ధనలక్ష్మి, నరేందర్, వరలక్ష్మి, భవానీ, మాధవి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పెరిఫెరల్ వాస్కులర్ వ్యాధులతోనే అవయవాల డ్యామేజ్



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

మాదాపూర్: అవయవాలు కోల్పోవడానికి పెరిఫెరల్ వాస్కులర్ డీసీజ్ ప్రధాన కారణమని వ్యాస్కులర్ సొసైటీ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ చెవుటూరి అన్నారు. మాదాపూర్‌లోని దుర్గం చెరువు లేక్ ఫ్రంట్ వద్ద ఆదివారం వ్యాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా వాకథాన్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, యేటా ప్రపంచవ్యాప్తంగా మిలియన్‌కు పైగా వ్యక్తుల అవయవాలను తొలగిస్తున్నారన్నారు. భారతదేశంలో దాదాపు 40 నుంచి 50 శాతం అవయవ తొలగింపు కేసుల్లో రక్త నాళాల వ్యాధులకు ముఖ్యంగా మధుమేహం కారణమవుతుందన్నారు. హైబ్లడ్ షుగర్, హైపర్‌టెన్షన్, అధిక కొలెస్ట్రాల్ వంటి ప్రమాద కారకాలపై అవగాహన, నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 30 నగరాల్లో నిర్వహించిన జాతీయ వాకథాన్‌లో 15 వేలకు పైగా పాల్గొన్నట్లు తెలిపారు. అవయవాల తొలగింపును తగ్గించాలనే లక్ష్యంతోనే వాకథాన్‌ను నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ పీసీ గుప్తా, వ్యాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు, వైద్య నిపుణులు, సర్జన్లు, ఇంటర్వెన్షనలిస్టులు, నర్సులు, అనుబంధ ఆరోగ్య నిపుణులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో బోనాల సందడి



మాదాపూర్: మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో ఆదివారం బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. షణ్ముక్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మ్యూజికల్ బ్యాండ్, తెలంగాణ స్థానిక కళారూపాలను ప్రదర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పాల్గొన్నారు.

అలరించిన 'కల్చరల్ కార్వాన్'



రాయదుర్గం: సాంస్కృతిక మంత్రిత్వ, పర్యాటక శాఖల సహకారంతో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్శిటీలోని ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాలను వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ కస్టమ్స్, జీఎస్టీ ప్రధాన కమిషనర్ సందీప్‌ప్రకాశ్, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలిమధుమిత, జష్న్-ఏ-ఆదాబ్ అధ్యక్షుడు నవనీత్‌సోని, కవి వ్యవస్థాపకుడు కున్వర్ రంజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీర్ల మధ్య ఘర్షణ!


గచ్చిబౌలి పీఎస్‌లో పరస్పర ఫిర్యాదులు

రాయదుర్గం: జీహెచ్ఎంసీకి చెందిన ఇద్దరు ఇంజినీర్లు ఘర్షణపడ్డారు. అందుకు గల కారణాలపై ఆరా తీస్తున్న పోలీసులు విచారణ అనంతరం కేసుల నమోదుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి సూపరింటెండెంట్ ఇంజినీర్ శంకర్, శేరిలింగంపల్లి సర్కిల్ ఏఈ రమేష్‌ల మధ్య మూడు రోజుల క్రితం మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారని తెలిసింది. ఎస్ఈ ఇంజనీర్లతో సీఎస్ఆర్ పనులపై చర్చిస్తుండగా..ఒక వర్క్ విషయంలో ఏఈ రమేష్ మాట్లాడడంతో ఆయనను ఎస్ఈ వారించినట్లు, తిట్ల వర్షం కురిపించినట్లు తెలిసింది. తిరిగి ఎస్ఈ దగ్గరకు ఏఈ వెళ్లి తనను దూషించడం, కొట్టడమేంటని ప్రశ్నించగా మళ్లీ ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలిసింది. అనంతరం ఈ విషయాన్ని సర్కిల్‌లోని అధికారుల దృష్టికి తెచ్చినా స్పందించకపోవడంతో ఏఈ రమేష్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసి ఎస్ఈ శంకర్ కూడా ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ కేసు విచారణ చేసిన తర్వాత కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇద్దరు వేర్వేరుగా ఫిర్యాదులు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇలా అధికారుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై మాట్లాడడానికి వారు నిరాకరిస్తున్నారు. దీంతో పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేస్తేనే వివరాలు బయటపడే అవకాశం ఉంది.

పర్యావరణ మార్పులతోనే వ్యాధులు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కాలనీ వాసులు



శిబిరంలో వైద్యులు, సీఆర్ ఫౌండేషన్ సభ్యులు

చందానగర్: పర్యావరణంలో వస్తున్న మార్పుల కారణంగానే వ్యాధులు సంక్రమిస్తున్నాయని తాడిబోయిన రామస్వామి యాదవ్ పేర్కొన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంజినీరింగ్ ఎన్‌క్లేవ్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఒమెగా హాస్పిటల్ సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాగ్, వెంకటేశ్ సుమారు 120 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం వైద్యులు, రామస్వామి యాదవ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాయమం, మెడిటేషన్, యోగా, ధ్యానం, వాకింగ్ కనీసం 40 నిమిషాలు చేయాలన్నారు. తాజా ఆకుకూరలు, సీజనల్ పండ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, కోడి గుడ్లు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. శిబిరంలో బీపీ, షుగర్, కంటి, దంత పరీక్షలతో పాటు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆంజనేయ రాజు, ప్రసాద్, సంబిరెడ్డి, కరుణాకర్ గౌడ్, చంద్రశేఖర్, వెంకట్రావు, బుచ్చయ్య, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్దన్, వెంకట ధర్మ సాగర్, నేమని విశ్వశాంతి, బాలాజీ, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో శిబిరం..

చందానగర్: డీకే హోమియో మెడికల్ కాలేజ్ సౌజన్యంతో కొండాపూర్ చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్‌లోని పాలి క్లీనిక్‌లో హోమియో, ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంపును ఆదివారం నిర్వహించారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ ప్రభావతి, డాక్టర్ అన్నపూర్ణ, పీజీ స్టూడెంట్స్‌తో కలిసి 50 మంది రోగులకు పరీక్షలు చేశారు. ప్రొఫెసర్ రామకృష్ణ సుమారు 40 మంది ఆర్థోపెడిక్ రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా హోమియో మందులు అందజేశారు. 50 శాతం డిస్కౌంట్‌తో షుగర్, బీపీ పరీక్షలు చేశారు. శిబిరంలో సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కే నారాయణ, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉపాధ్యక్షుడు కంభంపాటి అజయ్‌కుమార్, కోశాధికారి చెన్నకేశవరావు వైద్యులను సత్కరించారు. క్యాంపు హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని, విజయలక్ష్మి, డాక్టర్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.